సాక్షి
ఏలూరు
శనివారం । 5 । అక్టోబర్ । 2024



చోరీ కేసులో కవలల అరెస్టు
చోరీ కేసులో కవల సోదరులను పోలీసులు అదుపులోకి తీసుకుని రూ.5 లక్షల విలువైన బంగారు గొలుసులను స్వాధీనం చేసుకున్నారు.
6లో ▸



పోరుకు సిద్ధం
సంక్రాంతి కోడి పందాలకు పుంజులు సిద్ధమవుతున్నాయి. పూర్తిస్థాయిలో శిక్షణతో సన్నద్ధమవుతున్నాయి.
6లో ▸



అడ్డగోలు బదిలీలు
ఏపీసీపీడీసీఎల్‌లో పోస్టులు లేకుండానే లైన్‌మెన్లను బదిలీ చేశారు. ఇది నూజివీడు డివిజన్‌లో హాట్ టాపిక్‌గా మారింది.
6లో ▸

బాబు కుట్రలకు మొట్టికాయ

తిరుమల శ్రీవారి లడ్డూ వివాదంలో కూటమి ప్రభుత్వానికి సుప్రీంకోర్టులో మరోమారు ఎదురుదెబ్బ తగిలింది. కల్తీ వివాదంపై దాఖలైన పిటిషన్లపై విచారణ నిర్వహించిన ధర్మాసనం చంద్రబాబు సర్కారు ఏర్పాటు చేసిన సిట్‌ను రద్దు చేసింది. సీబీఐ డైరెక్టర్ పర్యవేక్షణలో స్వతంత్ర సిట్ ఏర్పాటుకు ఆదేశించింది. శ్రీవారి భక్తుల మనోభావాలు దెబ్బతీసేలా సీఎం చంద్రబాబు చేసిన కుట్రలకు చెంపపెట్టులా తీర్పు వచ్చిందంటూ నాయకులు, ప్రజలు అంటున్నారు.

కూటమికి చెంపపెట్టు
- శ్రీవారి లడ్డూ కల్తీపై స్పందించిన అత్యున్నత న్యాయస్థానం
- సీబీఐ డైరెక్టర్ పర్యవేక్షణలో స్వతంత్ర సిట్ ఏర్పాటుకు ఆదేశం
- సీఎం చంద్రబాబుకు మరోసారి ఎదురుదెబ్బ
- ఈ తీర్పు కూటమి నేతలకు చెంపపెట్టంటున్న ప్రజలు



సాక్షి ప్రతినిధి, ఏలూరు: దేవదేవుడిగా అత్యంత భక్తి శ్రద్ధలతో కోట్లాది మంది భక్తుల ఆరాధ్య దైవమైన తిరుపతి వేంకటేశ్వరస్వామి లడ్డూ ప్రసాదంపై తీవ్ర దుమారాన్ని రేపిన కూటమి సర్కారుకు సర్వోన్నత న్యాయస్థానం అక్షింతలు వేసింది. రాజకీయాల్లోకి దేవుడిని తీసుకురావద్దని.. స్వయంగా సుప్రీం న్యాయ మూర్తులు వ్యాఖ్యానించడం, పూర్తిస్థాయి దర్యాప్తుకు ఆదేశించడం కూటమి ప్రభుత్వానికి చెంపపెట్టులా మారింది. తిరుమల తిరుపతి దేవస్థా పవిత్రతకు భంగం కలిగించేలా లడ్డూను కల్తీ జరిగిందంటూ ఆధారాలు లేని ఆరోపణలు చేస్తూ యావత్తు దేశంలోని భక్తుల మనోభావాలను దెబ్బతీసేలా సీఎం చంద్రబాబు చేసిన ఆరోపణల్లో డొల్లతనాన్ని సుప్రీం బయటపెట్టింది. లడ్డూ తయారీలో వినియోగించే నెయ్యి కల్తీ జరిగిందా.. లేదా అనే అంశాలపై స్వతంత్ర సిట్‌ను నియమించడంతో పాటు సీబీఐ డైరెక్టర్ పర్యవేక్షణలో దర్యాప్తు జరిగేలా సుప్రీం ఆదేశాలు జారీ చేసింది. దీనిపై రాష్ట్రవ్యాప్తంగా సర్వత్రా కూటమి తీరును ఎండగడుతున్నారు.

బాబుకు చెంపపెట్టు



మతాల మధ్య చిచ్చు పెట్టి పబ్బం గడుపుకోవాలని చూసిన చంద్రబాబు కుట్రలకు సుప్రీంకోర్టు తీర్పు చెంపపెట్టులా ఉంది. వంద రోజుల పాలనపై అసహనం వ్యక్తం చేస్తున్న ప్రజలను ఏమార్చడానికి బాబు తిరుపతి లడ్డూ కల్తీ అంటూ చేసిన వ్యాఖ్యలు మత విద్వేషాలు రెచ్చగొట్టేందుకేనని అందరూ గమనించాలి. సూపర్ సిక్స్ అమలు చేయని క్రమంలో బాబు లడ్డూను వివాదాస్పదం చేసి సుప్రీం తీర్పుతో అభాసుపాలయ్యారు.
– కారుమూరి సునీల్ కుమార్‌యాదవ్, వైఎస్సార్ సీపీ ఏలూరు పార్లమెంట్ ఇన్‌చార్జి

తీర్పును స్వాగతిస్తున్నాం



తిరుపతి లడ్డూ వివాదంలో సుప్రీంకోర్టు సీబీఐ డైరెక్టర్ పర్యవేక్షణలో స్వతంత్ర సిట్ ఏర్పాటు చేయడం చంద్రబాబుకు చెంపపెట్టులాంటిది. దేవుడిని రాజకీయాల్లోకి లాగితే కోర్టుల ద్వారా ఇలాంటి మొట్టికాయలే పడతాయి. తిరుపతి లడ్డూ కల్తీ అంటూ కోట్లాది మంది మనోభావాలను దెబ్బతీస్తూ బురద రాజకీయం చేశారు. చంద్రబాబుకు దేవుడంటే భయం, భక్తి లేకపోయినా సీబీఐ రూపంలో అసలు నిజాలు బయటకు రావాలి. సిట్ ఏర్పాటును స్వాగతిస్తున్నాం.
–దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్), వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు

దేవుడితో రాజకీయాలా..



సాక్షాత్తూ వేంకటేశ్వరస్వామితోనే రాజకీయం చేయాలని చూసిన చంద్రబాబుకు సుప్రీం కోర్టు మొట్టికాయలు వేసింది. కోట్లాది మంది భక్తులు విశ్వసించే వేంకటేశ్వరస్వామి లడ్డూపైనే చంద్రబాబు తన స్వార్థ రాజకీయాల కోసం అసత్య ప్రచారాలు చేశారు. సుప్రీంకోర్టు నిర్ణయాన్ని వేంకటేశ్వరస్వామి పలికించినట్లు ఉంది. స్వతంత్ర్య దర్యాప్తు ఏర్పాటుతో వాస్తవాలు బయటకు వస్తాయి. దీంతో చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌ల నిజ స్వరూపాలు బయటపడతాయి.
– తెల్లం బాలరాజు, మాజీ ఎమ్మెల్యే, పోలవరం

ఇప్పటికైనా బుద్ధి తెచ్చుకోవాలి



లడ్డూ వివాదంపై సిట్ ఏర్పాటు సంతోషకరం. లడ్డూపై ముఖ్యమంత్రి దుష్ప్రచారం చేసి దానిని వైఎస్సార్‌సీపీకి ఆపాదించేలా కుట్రలు చేశారు. ఇది దుర్మార్గమైన, హేయమైన, నీచమైన చర్య. ఎటువంటి ఆరోపణలు లేకుండా ఇటువంటి నింద వేయడం చాలా దారుణం. ప్రపంచవ్యాప్తంగా తిరుమల లడ్డూకు ఉన్న ప్రత్యేకతను కూడా రాజకీయం చేసే పరిస్థితికి ముఖ్యమంత్రి చంద్రబాబు వచ్చారు. ఇప్పటికైనా చంద్రబాబు బుద్ధి తెచ్చుకోవాలి.
– కంభం విజయరాజు, వైఎస్సార్ సీపీ చింతలపూడి సమన్వయకర్త

ప్రజలను చీకట్లలోకి నెట్టి..



తిరుపతి పవిత్రతను దెబ్బ **తీసేలా కుట్రలకు** తెరతీసిన **సీఎం చంద్రబాబు,** డిప్యూటీ **సీఎం పవన్‌కల్యాణ్‌లకు** మంచి **బుద్ధి ప్రసాదించాలని** శ్రీవారిని **వేడుకుంటున్నా. చం**ద్రబాబు పాలనలో ప్రజలను **చీకట్లలోకి నెట్టి, సంక్షేమ** పాలనకు చరమగీతం పాడి, కనీసం విజయవాడ వరద బాధితులకు సైతం సాయం చేయలేదు. ఈ పరిస్థితిలో ప్రజల దృష్టిని మరలించేందుకు దేవుడితోనే ఆటలాడుతూ రాజకీయాలు మానుకోవాలని ప్రజలు కోరుతున్నారు.
– మామిళ్లపల్లి జయప్రకాష్, వైఎస్సార్ సీపీ ఏలూరు సమన్వయకర్త

రాజకీయ దురుద్దేశంతోనే..



చంద్రబాబు దోషిగా మిగిలారు. టీటీడీ ఈఓ కల్తీ నెయ్యి వాడలేదని స్పష్టంగా ప్రకటించారు. ఇందుకు విరుద్ధంగా చంద్రబాబు విష ప్రచారం చేశారు. వీటన్నింటిపై సుప్రీంకోర్టు అడిగిన ప్రశ్నలు బాబుకు చెంపపెట్టు వంటివి. రాష్ట్ర సిట్‌ను నిలుపుదల చేసి సుప్రీంకోర్టు స్వయంగా సిట్ వేయడంతో చంద్రబాబు నోటిలో పచ్చివెలగక్కాయ పడినట్లు అయింది. డైవర్షన్ రాజకీయాలు చేస్తూ వైఎస్సార్‌సీపీపై నిందలు వేసిన పాపం చంద్రబాబుకు చుట్టుకుంది.
– అప్పన ప్రసాద్, ఏఎంసీ మాజీ చైర్మన్, దెందులూరు

ఏ ఆధారంతో కల్తీ జరిగిందన్నారు



కల్తీ జరిగిందని సీఎం హోదాలో ఏ ఆధారంతో ప్రకటించారు. ఒకవైపు టీటీడీ ఈఓ లడ్డూలో కల్తీ నెయ్యి కలపలేదని ప్రెస్‌మీట్‌లో చెప్పారు. రాజకీయ వివాదాల్లోకి తిరుపతి లడ్డూను ముఖ్యమంత్రి చంద్రబాబు తీసుకురావడం తీవ్ర అభ్యంతరకరం. ప్రపంచ వ్యాప్తంగా కోట్లాది మంది హిందువుల మనోభావాలను చంద్రబాబు దెబ్బతీశారు. రాజ్యాంగబద్ధ పదవిలో ఉండి ఇలా చేయడం సరికాదు.
– మణిసింగ్, బౌద్ధప్రచార ట్రస్టు రాష్ట్ర అడ్వైజర్

శ్రీవారి అంతరాలయం.. స్వర్ణమయం

రూ.1.64 కోట్లతో బంగారు తాపడ నిర్మాణం పూర్తి

ద్వారకాతిరుమల: ద్వారకాతిరుమలలోని వేంకటేశ్వరస్వామి అంతరాలయం స్వర్ణ కాంతులీనుతోంది. కృష్ణా జిల్లా బాపులపాడు మండలం బొమ్ములూరుకు చెందిన దీపక్ నెక్స్‌జెన్ ఫీడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ అడుసుమిల్లి వెంకట సుబ్రహ్మణ్యం, డైరెక్టర్లు రూ. 1,64,19,411తో స్వామి వారి అంతరాలయానికి బంగారపు తాపడాన్ని చేయించారు. వీటి నిర్మాణ పనులు పూర్తి కావడంతో ఆలయ చైర్మన్ ఎస్వీ సుధాకరరావు, ఆయన కుమారుడు అనువంశిక ధర్మకర్త నివృతరావు, దాతలు, వారి కుటుంబ సభ్యులు శుక్రవారం అంతరాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా వారు స్వామి, అమ్మవార్లను దర్శించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ముఖ మండపంలో అర్చకులు, పండితులు దాత వెంకట సుబ్రహ్మణ్యంకు, డైరెక్టర్లకు శ్రీవారి శేష వస్త్రాలను కప్పి, వేద ఆశీర్వచనాన్ని పలకగా, ఆలయ చైర్మన్ సుధాకరరావు వారికి స్వామివారి మెమెంటోలు, ప్రసాదాలను అందజేశారు. ఆ తర్వాత దాతలు బంగారు తాపడానికి సంబంధించిన పత్రాలను చైర్మన్‌కు అందించగా, ఆయన దాతలను ప్రత్యేకంగా అభినందించారు.



అంతరాలయాన్ని సందర్శిస్తున్న ఆలయ చైర్మన్ సుధాకరరావు, అనువంశిక ధర్మకర్త నివృతరావు



దేవస్థానం చైర్మన్‌కు బంగారు తాపడ పత్రాలను అందిస్తున్న దాతలు వెంకట సుబ్రహ్మణ్యం తదితరులు

కేంద్రీయ విద్యాలయంపై అవగాహన రాహిత్య రాతలు

పచ్చ పత్రికపై మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ అప్పారావు మండిపాటు



నూజివీడు: నూజివీడులో కేంద్రీయ విద్యాలయం ఏర్పాటు గురించి ఓ పచ్చ పత్రిక అవగాహన రాహిత్యంతో రాతలు రాసి తన అజ్ఞానాన్ని తానే బయట పెట్టుకుందని నూజివీడు మాజీ ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు ధ్వజమెత్తారు. కేంద్రీయ విద్యాలయంపై పచ్చ పత్రికలో ఈనెల 3న ప్రచురించిన కథనంపై శుక్రవారం ఆయన మండిపడ్డారు. గతేడాది దేశవ్యాప్తంగా 87 కేంద్రీయ విద్యాలయాలను కేంద్ర ప్రభుత్వం మంజూరు చేస్తే రాష్ట్రంలో 8 విద్యాలయాలు ఉన్నాయన్నారు. కేంద్రీయ విద్యాలయం మంజూరు కావాలంటే తరగతుల నిర్వహణకు అవసరమైన భవనాలను సిద్ధం చేసి ముందుగానే ప్రతిపాదనలతో పంపాల్సి ఉంటుందని, అందుకే పట్టణంలోని ఎంప్లాయిస్ కాలనీలో మూతబడిన ప్రభుత్వ పాఠశాల భవనంపై రేకుల షెడ్డు నిర్మించి మొత్తం 16 తరగతి గదులను సిద్ధం చేసి ప్రతిపాదనలు పంపామని చెప్పారు. దీని మంజూరు కోసం తాను ఢిల్లీకి నాలుగుసార్లు వెళ్లి ఉన్నతాధికారులను కలిశానన్నారు. అలాగే అప్పటి సీఎం వైఎస్ జగన్‌కు విద్యాలయం ప్రాధాన్యతను వివరించగా ఏడెకరాల ప్రభుత్వ భూమిని కేటాయించారన్నారు. కేంద్రీయ విద్యాలయాన్ని తాత్కాలిక భవనంలో నడుపుతూనే కేటాయించిన 7 ఎకరాల్లో ఐదేళ్లలోగా కేంద్ర ప్రభుత్వం శాశ్వత భవనాలను నిర్మిస్తుందన్నారు. కేంద్రీయ విద్యాలయం మిథ్య కాదని, వాస్తమని స్పష్టం చేశారు. దీనిపై అనవసర రాద్ధాంతం చేయడం వల్ల నష్టపోయేది ఈ ప్రాంత విద్యార్థులే అన్నారు. పేదలకు మంచి విద్యను అందించాలనే సదుద్దేశంతో కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుకు కృషి చేశానన్నారు. దేశవ్యాప్తంగా మంజూరు చేసిన కేంద్రీయ విద్యాలయాలను ఇప్పటికీ ఎక్కడా ప్రారంభించలేదని.. ఇప్పుడున్న కూటమి ప్రభుత్వం రాష్ట్రంలోని కేంద్రీయ విద్యాలయాలను ప్రారంభించేలా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలన్నారు. ఎంప్లాయిస్ కాలనీలో సిద్ధం చేసిన తాత్కాలిక భవనాన్ని కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుకు మాత్రమే ఉపయోగించాలన్నారు. అదనపు గదుల నిర్మాణంలో ఎలాంటి అవకతవకలు జరగలేదని, స్వచ్ఛంద్ర కార్పొరేషన్, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ ఉన్నతాధికారులతో పాటు అప్పటి కలెక్టర్ సైతం నిధులు మంజూరు చేశారన్నారు. ఒక్క రూపాయి కూడా ఎక్కడా వృథా కాలేదని, సత్యదూర వార్తలు రాయడం మానుకోవాలని హితవుపలికారు.

ప్రజా భాగస్వామ్యంతో స్వర్ణాంధ్ర విజన్

ఏలూరు(మెట్రో): స్వర్ణాంధ్ర–2047 ఏపీ విజన్ అజెండాతో రాష్ట్ర పునర్నిర్మాణంలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని రాష్ట్ర గృహనిర్మాణ శాఖ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. స్వర్ణాంధ్ర–2047లో భాగంగా వచ్చే ఐదేళ్లకు జిల్లాస్థాయి దార్శనిక పత్ర రూపకల్పన కోసం జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టరేట్‌లో ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రతిఒక్కరూ సూచనలు అందించాలని కోరారు. జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ, జేసీ పి.ధాత్రిరెడ్డి, ఎమ్మెల్యేలు బడేటి చంటి, కామినేని శ్రీనివాస్, పత్సమట్ల ధర్మరాజు తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లపై.. ఖరీఫ్ ధాన్యం కొనుగోలులో రైతులకు ఎటువంటి సమస్యలు ఉత్పన్నం కాకూడదని మంత్రి పార్థసారథి అన్నారు. కలెక్టరేట్‌లో ధాన్యం కొనుగోలుపై రైస్ మిల్లర్లు, ట్రాన్స్‌పోర్టర్లు, పౌర సరఫరాల అధికారులతో జేసీ ధాత్రిరెడ్డితో కలిసి ఆయన సమీక్షించారు.

మద్యం టెండర్ల జోరు

ఏలూరు టౌన్: నూతన మద్యం పాలసీలో ప్రైవేటు మద్యం షాపులకు టెండర్లు స్పీడు పెరిగింది. అధికార పార్టీ ఎమ్మెల్యేలు, పార్టీ నేతల కనుసన్నల్లోనే మద్యం షాపులకు ఆన్‌లైన్ దరఖాస్తులు నమోదు అవుతున్నట్లు సమాచారం. జిల్లాలో ఏడు ఎక్సైజ్ సర్కిల్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో 144 మద్యం షాపుల ఏర్పాటుకు చర్యలు చేపట్టారు. ఒక రోజు ఆలస్యంగా టెండర్లు దాఖలు చేయటం ప్రారంభించగా మూడు రోజుల్లో 115 టెండర్లు అందినట్లు ఏలూరు జిల్లా ఎక్సైజ్ అధికారి అవులయ్య తెలిపారు. చింతలపూడి సర్కిల్ పరిధిలో అత్యధికంగా 38 టెండర్లు దాఖలు కాగా, అత్యల్పంగా ఏలూరు సర్కిల్‌లో 3 మాత్రమే వేశారు. నూజివీడు సర్కిల్‌లో 29, భీమడోలు సర్కిల్‌లో 20, జంగారెడ్డిగూడెం సర్కిల్‌లో 14, పోలవరం సర్కిల్‌లో 6, కైకలూరు సర్కిల్‌లో 5 చొప్పున టెండర్లు దాఖలయ్యాయి.

టెట్‌కు 322 మంది హాజరు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఉపాధ్యాయ అర్హత పరీక్ష టెట్ పరీక్షలు శుక్రవారం ఏలూరులోని రెండు కేంద్రాల్లో ప్రశాంతంగా జరిగాయి. ఉదయం 185 మందికి 159 మంది, మధ్యాహ్నం 185 మందికి 163 మంది హాజరయ్యారని జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.అబ్రహం తెలిపారు.

ట'మోత' మోగుతోంది

తాడేపల్లిగూడెం: టమాటా ధరల మోత మోగించనుంది. తమిళనాడు, కర్ణాటకలో టమాటాల దిగుబడులు ఆశాజనకంగా లేకపోవడంతో అక్కడి వ్యాపారులు రాష్ట్రంలోని మదనపల్లి మార్కెట్‌పై పడ్డారు. రెండు రోజుల క్రితం కిలో రూ.40 నుంచి రూ.60 ఉండగా శుక్రవారం ఒక్కసారిగా ధర పెరిగింది. తాడేపల్లిగూడెం మార్కెట్‌కు మదనపల్లి నుంచి టమాటా వస్తుంది. మదనపల్లి మార్కెట్‌లో 25 కిలోల ట్రే హోల్‌సేల్‌గా రూ.2,200 పలికింది. ఈ సరుకు రవాణా ఖర్చులతో కలిపి ఇక్కడ కిలో రూ.100 దాటనుంది. ఇక్కడి మార్కెట్‌లో 25 కిలోల ట్రే రూ.1,900కు విక్రయించారు. శనివారం టమాటా ధర మరింత పెరగనుంది. ఇదే బాటలో బెండ, బీరకాయల ధరలు కూడా పెరిగాయి.

కూటమి ప్రభుత్వంలో ఇసుక దోపిడీ

గళమెత్తిన భవన నిర్మాణ కార్మికులు

ఏలూరు (టూటౌన్): కూటమి ప్రభుత్వంలో ఇసుక బ్లాక్ మార్కెట్ పేరుతో దళారులు ప్రజలను దోచుకుంటున్నారని, ఉచిత ఇసుక విధానం పక్కాగా అమలు చేయాలని సీపీఎం ఏలూరు నగర కార్యదర్శి పి.కిషోర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం ఏలూరు తహసీల్దార్ వద్ద ఉచిత ఇసుక సమస్యపై సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఈ సందర్భంగా కిషోర్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఉచిత ఇసుక హామీ ఇచ్చారని, ఇప్పుడు ప్రజలకు అందుబాటులోకి లేకుండా చేశారని విమర్శించారు. ఇసుకకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు విధానం లోపబూయిష్టంగా ఉందన్నారు. పేద, మధ్య తరగతి ప్రజలకు ఎటువంటి రవాణా చార్జీలు లేకుండా ఇసుక సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. ఇసుక విధానం సరిగా లేక నిర్మాణ పనులు మందగించాయన్నారు. దీంతో లక్షలాది మంది భవన నిర్మాణ కార్మికులకు ఉపాధి లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. భవన నిర్మాణ కార్మికుల ఉపాధిని కాపాడాలని డిమాండ్ చేశారు. సీపీఎం నగర కమిటీ నాయకులు బి.జగన్నాథరావు, కె. రామాంజనేయులు, వీవీఎస్ ప్రసాద్, ఎం అరుణకుమారి, భవన నిర్మాణ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు. అలాగే నాయకులు ఏలూరు, పెదపాడు, ఉంగుటూరు, భీమడోలు, నిడమర్రు, ద్వారకాతిరుమల, జంగారెడ్డిగూడెం,, బుట్టాయగూడెం, కొయ్యలగూడెం, జీలుగుమిల్లి, నూజివీడు, ముసునూరు, ఆగిరిపల్లి, చింతలపూడి, టి.నర్సాపురం మండలాల్లో తహసీల్దార్లకు వినతిపత్రాలు అందించారు.



ఏలూరు (టూటౌన్): ఏలూరులో నిరసన తెలుపుతున్న సీఐటీయూ కార్యకర్తలు



జంగారెడ్డిగూడెం: నిరసన వ్యక్తంచేస్తున్న సీపీఎం నాయకులు



పెదపాడు: ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు



నూజివీడు: తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న దృశ్యం

న్యూస్‌రీల్

కైకలూరులో జాబ్‌మేళా



నియామక పత్రాలు అందిస్తున్న దృశ్యం

కైకలూరు: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడాప్, జిల్లా ఉపాధి కార్యాలయం, జవహర్ నాలెడ్జ్ సెంటర్ సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక వైవీఎన్నార్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం మెగా జాబ్‌మేళా నిర్వహించారు. 236 మంది హాజరుకాగా 52 మంది ఉద్యోగాలు సాధించినట్టు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎ.కృష్ణారెడ్డి చెప్పారు. ఉద్యోగాల కల్పనకు ప్రభుత్వ అధిక ప్రాధాన్యమిస్తుందని ఆయన అన్నారు. ప్రిన్సిపాల్ కె.సుజాత, జిల్లా ప్లేస్‌మెంట్ అధికారి కె.ప్రవీణ్, కో–ఆర్డినేటర్లు సురేష్, ప్రసాద్, సునీల్ పాల్గొన్నారు.

నూజివీడు ఆర్డీఓగా వాణి



నూజివీడు: నూజివీడు రెవెన్యూ డివిజన్ అధికారి (ఆర్డీఓ)గా మొవిడి వాణి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. మచిలీపట్నం నుంచి ఆమె ఇక్కడకు బదిలీపై వచ్చారు. ప్రభుత్వ ప్రాధాన్యతలకు అనుగుణంగా పనిచేస్తానని, గ్రీవెన్స్‌లో వచ్చిన సమస్యల సత్వర పరిష్కారానికి అధిక ప్రాధాన్యమిస్తామని ఆమె అన్నారు.

డీఎస్పీగా ప్రసాద్



నూజివీడు డీఎస్పీగా కిలాని వీరవెంకట నాగ వరప్రసాద్ (కేవీవీఎన్వీ ప్రసాద్) శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. విజయవాడ డీఎస్‌బీ ఏసీబీగా పనిచేస్తున్న ఆయన బదిలీపై ఇక్కడకు వచ్చారు. ప్రజలకు మంచి పోలీసింగ్ అందించేందుకు కృషిచేస్తానని ఆయన అన్నారు. నూజివీడు పట్టణ, రూరల్ సీఐలు పి.సత్యశ్రీనివాస్, కొప్పిశెట్టి రామకృష్ణ, ఎస్సైలు ఎన్.లక్ష్మణ్‌బాబు, శుభోశేఖర్‌లు ఆయన్ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

ఏలూరు ఏఎస్పీగా సూర్యచంద్రరావు



ఏలూరు టౌన్: ఏలూరు జిల్లా అదనపు ఎస్పీగా నక్కా సూర్యచంద్రరావు నియమితులయ్యారు. ప్రస్తుతం ఆయన సీఐడీ అదనపు ఎస్పీగా పనిచేస్తూ ఉండగా బదిలీపై ఏలూరు రానున్నారు. గతంలో ఆయన స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అదనపు ఎస్పీగా ఏలూరు జిల్లాలో పనిచేశారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన అనంతరం అదనపు ఎస్పీ జి.స్వరూపరాణిని బదిలీ చేయగా అప్పటి నుంచి ఏలూరు జిల్లా అదనపు ఎస్పీ పోస్టు ఖాళీగా ఉంది.

నడక పోటీల్లో ప్రతిభ



విజేతగా నిలిచిన రాజేశ్వరి

ద్వారకాతిరుమల: యూటీఎఫ్ స్వర్ణోత్సవాలను పురస్కరించుకుని గుంటూరులో ఉపాధ్యాయుల రాష్ట్రస్థాయి ఆటల పోటీలను శుక్రవారం నిర్వహించారు. 45 ప్లస్ మహిళల నడక పోటీలో ద్వారకాతిరుమల మండలం పంగిడిగూడెం జెడ్పీ హైస్కూల్ ఉపాధ్యాయురాలు పైడి రాజేశ్వరి ప్రథమ స్థానంలో నిలిచారు. ఆమెను యూటీఎఫ్ జిల్లా కార్యదర్శులు జి.దేవానందరావు, రాంబాబు, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీనివాసరావు, జయరాజు అభినందించారు.

ఏలూరు డీఎఫ్ఓగా శుభాన్

ఏలూరు రూరల్: ఏలూరు డీఎఫ్ఓగా శుభాన్‌ను నియమించారు. ఇటీవల చేపట్టిన బదిలీల్లో భాగంగా ఏలూరు జిల్లా అటవీ శాఖాధికారిగా శుభాన్ నియమిస్తూ శుక్రవారం ప్రభుత్వం ఉత్తర్వులు విడుదల చేసింది. ఇప్పటివరకూ ఏలూరు జిల్లాగా డీఎఫ్ఓ పనిచేసిన రవీంద్రధామ్ రంపచోడవరానికి బదిలీ అయ్యారు.

రఘురామ కృష్ణరాజు బహిరంగ క్షమాపణ చెప్పాలి

భీమవరం: కాళ్ల మండలం ఏలూరుపాడులో బీఆర్ అంబేడ్కర్ ఫ్లెక్సీ వివాదానికి సంబంధించి ఉండి ఎమ్మెల్యే కనుమూరి రఘురామకృష్ణరాజు అంబేడ్కర్ విగ్రహం వద్ద బహిరంగ క్షమాపణ చెప్పాలని దళిత సంఘాలు డిమాండ్ చేశాయి. శుక్రవారం పట్టణంలోని అంబేడ్కర్ భవనంలో దళిత సంఘాల ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు.

క్లుప్తంగా

చోరీ కేసులో కవలల అరెస్ట్



వివరాలను వెల్లడిస్తున్న ఎస్పీ ప్రతాప్ శివ కిషోర్

ఏలూరు (టూటౌన్) : చోరీ కేసులో కవల సోదరులను పోలీసులు అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి రూ.5 లక్షలు విలువైన 60 గ్రాముల బంగారు గొలుసులను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు వివరాలను ఎస్పీ కె.ప్రతాప్ శివ కిషోర్ తన కార్యాలయంలో శుక్రవారం వెల్లడించారు. ఈ ఏడాది ఆగస్టు నెలలో కృష్ణాష్టమి రోజున రాత్రి 7 గంటల సమయంలో ఒక మహిళ మెడలో బంగారు చైనును లాక్కొనిపోయిన కేసులో ఏలూరు రూరల్ మండలం పైడిచింతపాడు గ్రామానికి చెందిన సైదు రాఘవేంద్ర ప్రసాద్ (27), సైదు రవీంద్రప్రసాద్ (27)లను అరెస్టు చేశామన్నారు. వీరు ఏలూరు వన్‌టౌన్, టూటౌన్, కైకలూరు పోలీస్ స్టేషన్ ప్రాంతాల్లో మహిళల మెడల్లో గొలుసులను దొంగతనాలకు పాల్పడినట్టు ఎస్పీ తెలిపారు. ఈ కేసులో ప్రతిభ కనబర్చిన ఏలూరు వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, నిడమర్రు ఇన్‌స్పెక్టర్ ఎం సుభాష్, ఎస్సై మదీనా బాషా, సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

అంబేడ్కర్ విగ్రహం చూపుడువేలు ధ్వంసం



విగ్రహ చూపుడు వేలును పరిశీలిస్తున్న డీఎస్పీ

జంగారెడ్డిగూడెం: అంబేడ్కర్ విగ్రహం వేలు ధ్వంసం చేసిన వారు ఎంతటి వారైనా చట్టప్రకారం శిక్షిస్తామని డీఎస్పీ యు.రవిచంద్ర అన్నారు. జంగారెడ్డిగూడెం కొత్త బస్టాండ్ వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహం చూపుడు వేలు గురువారం రాత్రి ధ్వంసమైంది. దీంతో దళిత సంఘాలు శుక్రవారం స్థానిక బస్టాండ్ వద్ద ఆందోళన చేశారు. విషయం తెలుసుకున్న డీఎస్పీ ఘటనా స్థలానికి చేరుకుని విగ్రహాన్ని పరిశీలించారు. ఆ ప్రాంతంలో సీసీ కెమేరా ఏర్పాటు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ నాయకులు అలుగు ఆనందశేఖర్, వెంప ఐజీ, కాటం డేవిడ్, మానుకొండ కిషోర్, పంతగాని వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

6 నుంచి ట్రిపుల్ ఐటీలకు దసరా సెలవులు


నూజివీడు: రాజీవ్‌గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం (ఆర్జీయూకేటీ) పరిధిలోని నూజివీడు, ఇడుపులపాయ, ఒంగోలు, శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీలకు ఈ నెల 6 నుంచి 13 వరకు దసరా సెలవులు ఇస్తున్నట్టు ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ఆచార్య సంద్ర అమరేంద్ర కుమార్ శుక్రవారం తెలిపారు. ఈ నెల 14న పునఃప్రారంభమవుతాయని పేర్కొన్నారు.

డబ్లింగ్ కరెన్సీ ముఠా సభ్యుడి అరెస్ట్

జంగారెడ్డిగూడెం: డబ్లింగ్ కరెన్సీ ముఠా సభ్యుడిని పోలీసులు అరెస్టు చేశారు. ఎస్సై ఎస్‌కే జబీర్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. జంగారెడ్డిగూడెంలోని జేపీ సెంటర్‌లో చైనీస్ రెస్టారెంటు నడుపుతున్న భద్రా జ్యోతికుమార్ అనే వ్యక్తికి వాటర్ క్యాన్ల వ్యాపారం చేసే మద్దిపాటి కళ్యాణ్ అనే వ్యక్తి ముందుగా రెండు రూ.500 నోట్లిచ్చి మార్చమన్నాడు. అవి మారడంతో జ్యోతికుమార్ వద్ద నుంచి రూ.45 వేలు తీసుకుని, రూ.90 వేలు కరెన్సీని కళ్యాణ్ ఇచ్చాడు. అనంతరం రూ.6 లక్షలు తీసుకుని రూ.12 లక్షలు ఇస్తానని తెల్లకాగితాలున్న బ్యాగు ఇవ్వడంతో కళ్యాణ్‌ను ప్రశ్నించగా, జ్యోతికుమార్‌ను చంపేస్తానని, రెస్టారెంట్‌ను తగులబెడతానని బెదిరించాడు. ఈ నేరంపై కళ్యాణ్‌ను అరెస్టు చేసినట్లు ఎస్సై తెలిపారు.



ఆకివీడులోని నాటుకోళ్ల కేంద్రంలో ఉన్న పందెం పుంజులు



నాటుకోళ్ల కేంద్రం వద్ద పందెం పుంజులు

పోరుకు సిద్ధమవుతున్న పుంజులు

- సంక్రాంతికి మూడు నెలల ముందు నుంచే శిక్షణ
- ఉదయాన్నే వాకింగ్, స్విమ్మింగ్
- ఒక్కో పుంజుపై రూ.25 వేల నుంచి రూ.30 వేల వరకు వ్యయం
- మటన్, గుడ్డు, బాదం, ఎండు ఖర్జూరం, వెల్లుల్లితో ప్రత్యేక మేత మెనూ
- జిల్లాలో 200లకు పైగా నాటుకోళ్ల పెంపకం కేంద్రాలు
- సంక్రాంతి సీజన్‌కు రూ.20 కోట్లకుపైగా వ్యాపారం



కోడిడేగ

సాక్షి, భీమవరం : సంక్రాంతి పండుగల పేరు చెబితే గుర్తుకు వచ్చేవి పశ్చిమగోదావరి జిల్లాలో జరిగే కోడి పందాలే. మూడు రోజులు కోడి పందాలు ద్వారా కోట్లాది రూపాయలు చేతులు మారతాయి. కొద్ది నిముషాల పాటు జరిగే పందెం బరిలో ప్రత్యర్థి పుంజును మట్టికరిపించేందుకు సంక్రాంతికి మూడు నెలల ముందు నుంచే పందెం పుంజులకు శిక్షణ ఇస్తున్నారు.

ప్రత్యేకంగా బరులు

భీమవరం పరిసర ప్రాంతాల్లో ప్రత్యేకంగా బరులు, గ్యాలరీలు, ఎల్‌ఈడీ స్క్రీన్లు ఏర్పాటుచేసి నిర్వహించే కోడి పందాలు ఖ్యాతిగాంచాయి. వీటిని చూసేందుకు ఎందరో సినీ, రాజకీయ ప్రముఖులు వస్తుంటారు. పందాలకు ఉన్న క్రేజీకు తగ్గట్టుగానే పుంజుల పెంపకంలో పందెంరాయుళ్లు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటారు. కొందరు తమ ఇళ్లు, చెరువులు, పొలాలు వద్ద పుంజులను పెంచితే ఎక్కువ మంది నాటుకోళ్ల కేంద్రాల్లో పుంజులను ఎంచుకుని వాటిని పందాలకు సిద్ధం చేసే పనిని పెంపకందారులకే అప్పగిస్తారు. హైదరాబాద్, బెంగుళూరు, చెన్నై తదితర నగరాలతో పాటు విదేశాల నుంచి సంక్రాంతికి జిల్లాకు వచ్చే ఔత్సాహికులు ఆన్‌లైన్‌లో పుంజులను ఎంపిక చేసుకుని పెంపకందారులకు ముందే అడ్వాన్స్‌లు చెల్లిస్తుంటారు. పందెం పుంజులకు ఉన్న డిమాండ్‌తో జిల్లాలోని భీమవరం, ఉండి, ఆకివీడు, పాలకోడేరు, పాలకొల్లు, కాళ్ల తదితర మండలాల్లో 200కు పైగా నాటుకోళ్ల పెంపకం కేంద్రాలు ఉన్నాయి. కొందరు స్థలాలను లీజుకు తీసుకుని వీటి పెంపకం సాగిస్తుంటారు. సామర్థ్యాన్ని బట్టి ఒక్కోచోట 100 నుంచి 250 వరకు వివిధ రకాల జాతుల పుంజులు, కోళ్లను పెంచుతుంటారు.

దినచర్య ఇలా..




పుంజును నీళ్ల తొట్టెలో ఉంచి ఈత కొట్టిస్తున్న దృశ్యం

మకాంలోని ఐరెన్ కేజీలలో ఉండే పందెం కోళ్లను బయటకు తీసి ఆరుబయట కట్టడం మొదలుపెడతారు. అప్పటి నుంచే వీటి శిక్షణ మొదలవుతుంది. ప్రస్తుతం చాలా మకాంల వద్ద పుంజులను బయట కట్టడం ప్రారంభించారు. రోజు ఉదయాన్నే వేడి నీటిని పట్టిస్తారు. బరిలో చురుగ్గా కదిలేందుకు వీలుగా కాళ్లల్లో చురుకుదనానికి నెలరోజులు పాటు రోజు విడిచి రోజు సమీపంలోని చెరువులు, నీళ్ల తొట్టెల్లో ఈత కొట్టిస్తారు. తర్వాత వీ ఆకారంలో నెట్‌లు కట్టి పుంజు అందులోనే తిరిగే విధంగా బేటా (నిర్ణీత పద్ధతిలో వాకింగ్) కొట్టిస్తారు. మరికొందరు ఖాళీ జాగాలో వాటి వెనుకే ఉండి తరుముతూ వాకింగ్ చేయిస్తారు. మేత పెట్టి 11 గంటల సమయం వరకు ఎండలో కట్టేసిన తర్వాత మకాంలోకి మార్చేస్తారు. పండుగలు దగ్గర పడుతున్న కొద్దీ పుంజు శరీరం గట్టిపడేందుకు, నొప్పులేమైనా ఉంటే తగ్గేందుకు ప్రత్యేక ట్రైనర్లతో నీళ్లపోతలు, శాఖలు చేయిస్తారు.

శిక్షణపై ప్రత్యేక శ్రద్ధ



అబ్రాస్



కాకిడేగ

కాకి, నెమలి, అబ్రాస్, డేగ, పచ్చకాకి, కేతువ తదితర జాతులకు చెందిన ఏడాదిన్నర నుంచి రెండేళ్ల వయసు కలిగిన పుంజులను పందాలకు వినియోగిస్తుంటారు. ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో వీటి పాత ఈకలు ఊడిపోయి కొత్త ఈకలు వస్తుంటాయి. తర్వాతి నుంచి వీటికి శరీర పటుత్వం, శక్తిని పెంచేందుకు శిక్షణ ప్రారంభిస్తారు. అందుకోసం ఎవరికి వారు ఎన్నో సంప్రదాయ, ఆధునిక పద్ధతులు పాటిస్తారు. పుంజులకిచ్చే ఆహారం, మందులు నుంచి శిక్షణ వరకు ప్రతి విషయంలో ఎన్నో జాగ్రత్తలు తీసుకుంటారు. తాము ఎలా పెంచుతుందీ ఇతరులకు తెలీకుండా గోప్యత పాటిస్తారు.

5 వేలకు పైగా కోళ్లు

కోడికి అందించే ప్రత్యేక మేత, మందులతో ఒక్కో పందెం పుంజును సిద్ధం చేసేందుకు మూడు నెలల్లో రూ.25 వేల నుంచి రూ.30 వేల వరకు ఖర్చవుతుంది. ఈ విధంగా పెంచిన పుంజులను వాటి రంగు, ఎత్తు, పోరాట పటిమను బట్టి రూ.50 వేల నుంచి రూ.లక్షల్లో అమ్ముతుంటారు. వీటిపై భారీస్థాయిలో పందాలు జరుగుతుంటాయి. పండుగల కోసం ఐదు వేలకు పైగా పందెం కోళ్ల అమ్మకాలు జరుగుతుంటాయి. వీటి ద్వారా రూ.20 కోట్లకు పైగా వ్యాపారం జరుగుతుందని అంచనా.



కేతువ

మేత దర్జానే వేరు

కోపం వచ్చినప్పుడు నిన్ను పందెం పుంజును మేపినట్టు మేపానని దెప్పడం గోదావరి జిల్లాల్లో నానుడి. దీనినిబట్టి పందెం కోళ్లను ఇక్కడ ఏ విధమైన మేతను అందిస్తారో అర్థం చేసుకోవచ్చు. శిక్షణలో శక్తి, సామర్థ్యం పెంచేందుకు, శరీరంలో కొవ్వు చేరకుండా తేలిగ్గా ఎగురుతూ ప్రత్యర్థిపై విరుచుకుపడేందుకు పందెం పుంజులకు ఈ మూడు నెలలు ప్రత్యేక మేతను అందిస్తారు. కోడి సైజును బట్టి ఉదయం పూట 20 నుంచి 40 గ్రాముల వరకు ఉడకబెట్టిన మటన్, మూడు నుంచి ఐదు వరకు బాదం, రెండు వెల్లుల్లి, ఒక ఎండు ఖర్జూరం, కోడి గుడ్డు ముక్కలు చేసి పెడతారు. తిరిగి సాయంత్రం ఎప్పటిమాదిరి సోళ్లు, గంటులు, మెరికలు మొదలైన వాటిని పెడతారు. పండుగలకు మూడు నెలలు మాత్రమే సమయం ఉండటంతో ఇప్పటికే భీమవరం పరిసర ప్రాంతాల్లో పందెంకోళ్ల పెంపకం జోరుగా సాగుతోంది.



తెల్లనెమలి

ఏపీసీపీడీసీఎల్‌లో అడ్డగోలు బదిలీలు

- పోస్టులు లేకుండా లైన్‌మెన్ల బదిలీలు
- మంత్రి సిఫార్సు వల్లే అంటూ ప్రచారం



నూజివీడులోని ఏపీసీపీడీసీఎల్ ఈఈ కార్యాలయం

నూజివీడు: ఉద్యోగం ఇవ్వాలన్నా, బదిలీ చేయాలన్నా పోస్టు మంజూరై ఉండాలి. పోస్టు లేకుండా ఈ రెండింటిలో ఏదీ చేయడానికి కుదరదు. అయితే ఏపీసీపీడీసీఎల్‌లో అదేమీ అక్కర్లేదు. పోస్టు లేనిచోట్లకు ఇద్దరిని బదిలీ చేసేశారు. ఇదేంటని తోటి ఉద్యోగులు అడుగుతుంటే మంత్రి సిఫార్సు లేఖల మహత్యం అంటూ ప్రచారం నడుస్తోంది. ఏపీసీపీడీసీఎల్ నూజివీడు డివిజన్‌లో ప్రస్తుతం ఇదే హాట్ టాపిక్‌గా మారింది. ఏపీసీపీడీసీఎల్ నూజివీడు డివిజన్‌లో ఇటీవల ఉద్యోగుల బదిలీలు జరిగాయి. అయితే నూజివీడు పట్టణంలో ఉన్న 4 పోస్టుల్లో నలుగురు లైన్‌మెన్‌లు పనిచేస్తున్నారు. ఇక్కడ లైన్‌మెన్ పోస్టులు ఖాళీ లేకపోయినప్పటికీ ఇద్దరిని పట్టణానికి బదిలీ చేయడంపై విద్యుత్ శాఖలో తీవ్ర ఆశ్చర్యం వ్యక్తమవుతోంది. నూజివీడు మండలం ముక్కొల్లుపాడు లైన్‌మెన్‌గా పనిచేస్తున్న షేక్ మాబూ సుభాని, ఆగిరిపల్లి మండలం నర్సింగపాలెం లైన్‌మెన్‌గా పనిచేస్తున్న బి.రంగారావును నూజివీడుకు లైన్‌మెన్‌లుగా బదిలీచేశారు. మంత్రి సిఫార్సు లేఖలుండటం, వీరిద్దరిలో ఒకరు 1104 యూనియన్‌లో, మరొకరు 327 యూనియన్‌లో నాయకులుగా ఉండటం వల్లే నిబంధనలకు విరుద్ధంగా బదిలీలు చేశారనే విమర్శలు వస్తున్నాయి. నూజివీడు ఈఈ ఎ.సత్యనారాయణ అడ్డగోలుగా బదిలీ చేయడం గమనార్హం. ఇంకో విచిత్రమేమిటంటే ముక్కొల్లుపాడు నుంచి లైన్‌మెన్‌ను బదిలీ చేసి ఆ స్థానంలో మాత్రం జూనియర్ లైన్‌మెన్‌ను నియమించడం కొసమెరుపు. పోస్టులు లేకుండా బదిలీ చేయడం వల్ల వీరికి జీతాలు ఎలా ఇస్తారనే ప్రశ్నలు సైతం ఎదురవుతున్నాయి. ఈ బదిలీలపై ఉన్నతాధికారులు సమగ్ర విచారణ నిర్వహించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఇచ్చిన హామీలు నిలబెట్టుకోండి

రజక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కట్లయ్య



రజక సంఘం ముఖ్య నాయకుల సమావేశంలో మాట్లాడుతున్న కట్లయ్య

ఏలూరు (టూటౌన్): డిప్యూటీ సీఎం సారూ రాష్ట్రంలోని రజకులకు గతంలో మీరిచ్చిన హామీని నిలబెట్టుకోవాలంటూ రాష్ట్ర రజక సంఘం ప్రధాన కార్యదర్శి, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షుడు చిలకలపల్లి కట్లయ్య డిమాండ్ చేశారు. ఏలూరులోని ఏటిగట్టులో గల రజక సంఘం జిల్లా కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ గతంలో ఉండి నియోజకవర్గం కాళ్ల మండలం పెదఅమిరం వచ్చినప్పుడు రజకుల సమస్యలు చెప్పాలంటూ తనను ఆహ్వానించి మాట్లాడించారని గుర్తుచేశారు. రాష్ట్రంలోని రజకుల వృత్తి చెరువులపై పూర్తిస్థాయి హక్కులు కల్పించాలని, రజక చెరువుల ఆక్రమణలు తొలగించి ఫెన్సింగ్ ఏర్పాటు చేయించాలని, రజకులను కులం పేరుతో అవమానించిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని తదితర డిమాండ్లను ఆయన దృష్టిలో ఉంచానని చెప్పారు. తాను అధికారంలోకి వచ్చిన వెంటనే రజకుల సమస్యలను పరిష్కరిస్తానంటూ అప్పట్లో ఆయన హామీ ఇచ్చారని తెలిపారు. ప్రస్తుతం రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రిగా ఉన్న పవన్ కళ్యాణ్ రజకుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. అయ్యవరం గ్రామంలో రజకులకు కేటాయించిన ఎర్రికుంట చెరువుకు మోటార్ బోర్, విద్యుత్ సౌకర్యం ఏర్పాటు చేయాలని, రూ.10 లక్షలతో విశ్రాంతి భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో నాయకులు జువ్వలపాలెపు సత్యనారాయణ, వడిగ్ల శ్రీను, బయ్యన్నగూడెం ప్రసన్న, అవిడి సుబ్రహ్మణ్యం, కోటి చుక్కల వెంకటేశ్వర్లు, శంకవరం మహాలక్ష్మి, రాచూరి సుబ్బారావు, కొమ్మండి మురళి, దేవరపల్లి సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

చోరీ సొత్తు స్వాధీనం : నిందితుడి అరెస్ట్



చోరీ సొత్తుతో నిందితుడి వివరాలను వెల్లడిస్తున్న సీఐ విల్సన్, ఎస్సై సుధాకర్

భీమడోలు: భీమడోలులో తాళం వేసిన ఇంట్లో చొరబడి బంగారు, వెండి ఆభరణాలను దొంగిలించిన అదే గ్రామానికి చెందిన పాత ముద్దాయి కర్నాటి విజయకుమార్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. శుక్రవారం కోర్టులో హాజరుపర్చారు. అతని వద్ద నుంచి రూ.73 వేల విలువ గల ఒక కాసు బంగారు, 13 తులాల వెండి పట్టీలను స్వాధీనం చేసుకున్నారు. భీమడోలు పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై వై.సుధాకర్‌తో కలిసి సీఐ యూజే విల్సన్ రికవరీ చేసిన సొత్తును ప్రదర్శించారు. భీమడోలులోని కఠారి వీధికి చెందిన చల్ల మరియమ్మ అనే మహిళ అదే గ్రామంలో ఓ అద్దె ఇంట్లో ఒంటరిగా ఉంటోంది. బట్టల బ్యాగులో ఒక కాసు బంగారు ఆభరణాలు, 13 తులాల వెండి పట్టీలను పెట్టి ఇంటికి తాళం వేసి ఆగస్ట్ 12వ తేదీన కూలి పనుల నిమిత్తం తణుకులోని తన అక్క ఇంటికి వెళ్లింది. పనులు ముగించుకుని ఆమె గత నెల 28వ తేదీన ఇంటికి వచ్చే సమయానికి తన ఇంటి తాళాలు పగులకొట్టి ఆభరణాలు దొంగిలించుకుపోవడంపై పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎస్సై వై.సుదాకర్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. ఈనెల 3వ తేదీ గురువారం సాయంత్రం భీమడోలు జంక్షన్ వద్ద నిందితుడు సెంట్రింగ్ పనులు చేసే కర్నాటి విజయకుమార్ అదుపులోకి తీసుకుని, అతని వద్ద ఉన్న చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నారు. విజయకుమార్ రాజమండ్రి, గణపవరం, నిడమర్రు పోలీస్‌స్టేషన్లో మూడు కేసుల్లో ముద్దాయిగా ఉన్నట్టు సీఐ తెలిపారు. కేసు దర్యాప్తులో సహకరించిన హెచ్‌సీ ఎస్ శ్రీనివాసరావు, కానిస్టేబుల్స్ బి.గోపాలకృష్ణ, జి.ఆంజనేయులును అభినందించారు.

ట్రాక్టర్ ట్రక్కు పల్టీకొట్టి విద్యార్థి మృతి



వేలేరుపాడు: డ్రైవింగ్ రాని బాలుడికి ట్రాక్టర్ ఇవ్వడం వల్ల ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థి చినబుర్రతోగు గ్రామానికి చెందిన చిచ్చడి వంశీ (16) ప్రాణం కోల్పోయాడు. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. భూదేవిపేటకు చెందిన నకిరిగంటి సాంబశివరావు తన సొంత ట్రాక్టర్‌పై తన పొలంలో కూలి పనులకు తనతో పాటు చిన బుర్రతోగు గ్రామానికి చెందిన చిచ్చడి వంశీ, సవలం చందు (15)ని వెంటబెట్టుకొని వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో చందుకు డ్రైవింగ్ చేసేందుకు స్టీరింగ్ ఇచ్చాడు. వసంతవాడ, భూదేవిపేట మార్గమధ్యంలో శుక్రవారం సాయంత్రం ట్రాక్టర్ ట్రక్కు బోల్తాపడింది. ట్రక్కులో ఉన్న వాటర్ ట్యాంక్ కిందపడి వంశీ అక్కడికక్కడే మృతి చెందాడు. జీలుగుమిల్లి మండలం బర్రింకలపాడు రెసిడెన్షియల్ కళాశాల నుంచి రెండురోజుల క్రితమే స్వగ్రామం వచ్చిన వంశీని సాంబశివరావు కూలికి తీసుకెళ్లడం వల్లే ప్రాణం పోయిందని తల్లిదండ్రులు చిచ్చడి రాంబాబు, బుజ్జమ్మలు కన్నీటి పర్యంతమయ్యారు. ట్రాక్టర్ నడుపుతున్న బాలుడు సవలం చందు, యజమాని నకిరిగంటి సాంబశివరావు, నర్సింహారావు తదితరులపై శుక్రవారం రాత్రి కేసు చేశామని ఎస్సై కేవీ రామారావు తెలిపారు.



